చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ


ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్‌గా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నివాసంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బీసీ సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారని గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

2027 నాటికి భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చు

- భారతదేశం 62.5 శాతం శ్రామిక జనాభాను కలిగి ఉంది
- సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డా.బివిఆర్ మోహన్‌రెడ్డి

రాయదుర్గం: భారతదేశం 2027 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారవచ్చని సైయింట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో స్వర్ణోత్సవం, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్‌జూబ్లీ వేడుక వేళ 25 విశిష్ట ఉపన్యాసాల శ్రేణిని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనదేశం పదేళ్ళ కాలంలో 7 శాతం జీడీపీ వృద్ధి రేటుతో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారామన్నారు. భారతదేశంలో 62.5 శాతం మంది శ్రామిక జనాభా ఉన్నారని, ఉత్పాదకత, వినియోగం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించగలదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తోందని, తయారీ, ఉద్యోగ కల్పనను పెంచడానికి మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్య యొక్క నాణ్యత, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ అండ్ డీ, సాంకేతికతలలో ఆవిష్కరణలలో పెట్టుబడులు పెట్టడం అవసరమన్నారు.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మానవశక్తిని అధిగమిస్తోందన్నారు. సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థ కోసం నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పరిశోధన, అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. యువత వీలైనంత కష్టపడి పనిచేయాలని, ఇదే ఎదగడానికి సహాయపడుతుందన్నారు.

రూ.20 లక్షల పెట్టుబడి .. రూ.25వేల కోట్లు

30 ఏళ్ల క్రితం రూ.20 లక్షల పెట్టుబడి, నలుగురు ఇంజనీర్లతో ప్రారంభమై ప్రస్తుతం 18వేల మంది ఇంజనీర్లతో 14 దేశాలలో రూ.25 వేల కోట్ల సంస్థను నిర్మించామన్నారు. భారతదేశంలో 140 కోట్ల జనాభాలో 16 నుంచి 60 ఏళ్ల లోపువారు 62.5శాతం మంది ఉన్నారని, వీరిందరిలో శ్రమించే శక్తి ఉందని, వీరు తలచుకుంటే ఏదైనా సాధ్యమని ఆయన అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, డాక్టర్ పూనమ్‌సింగ్, ప్రొఫెసర్ ఐరాల లంకానంద్‌రెడ్డి ప్రసంగించారు.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితం

ప్రొ.మధుర స్వామినాథన్

పటాన్‌చెరు: భారతదేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, వ్యవసాయ వర్గ సంబంధాలపై చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి అయిన ఆమె మంగళవారం 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావించారు.గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను ఆమె వివరించారు. సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన 'ట్రైబ్ క్లాస్ లింకేజ్: త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు' అనే పుస్తకాన్ని డాక్టర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకం త్రిపురలోని గిరిజన జనాభాలో వ్యవసాయ వర్గ సంబంధాల అభివృద్ధికి సంబంధించిన చారిత్రక అధ్యయనాన్ని వివరిస్తుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరం



గచ్చిబౌలి స్టేడియంలో గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

భారత హాకీ టీమ్ కోచ్ సౌందర్య

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠశాల స్థాయి నుంచే ఆటలు అవసరమని భారత హాకీ కోచ్ సౌందర్య పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గౌతమ్ మోడల్ స్కూల్ అల్కాపూర్, నార్సింగి బ్రాంచ్‌లు సంయుక్తంగా ఉత్కర్ష్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. పిల్లలు చురుగ్గా, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎం వెంకటనారాయణ మాట్లాడారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే కూడా నిర్వహించారు. కార్యక్రమంలో వర్ధమాన క్రికెటర్ ఆరోన్‌జార్జి వర్గీస్ , విద్యాసంస్థల కార్యదర్శి కేఆర్‌కే రెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్, భరత్, బిజినెస్ హెడ్ కె భరద్వాజ్, ప్రిన్సిపల్ సునీత, అనూష, ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠాను పట్టుకున్న ఎస్‌ఓటీ పోలీసులు

రూ.57 వేలు నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

మాదాపూర్: సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు వ్యభిచార ముఠాను పట్టుకుని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని వెస్ట్ ఫ్రంట్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 102లో వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి మేనేజర్, ముగ్గురు బాధితులు, ఇద్దరు కస్టమర్లు మొత్తం 6 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. గౌడ తులిప్ అపార్ట్‌మెంట్ ప్లాట్‌నెంబర్ 117, మాదాపూర్‌లో ఉంటున్న ఆర్గనైజర్, రంగని చైత్ర (33), గుంటూరుకి చెందిన మర్రి శివకుమార్(42) కస్టమర్, బెంగుళూరికి చెందిన రాంచందర్(64) కస్టమర్, బిహార్‌కి చెందిన పిట్ల పాస్మాన్(26) (మేనేజర్) మాదాపూర్‌లోని వెస్ట్‌ఫ్రంట్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు . నిందితులతో బాటు నగదు రూ. 57,500, కండోమ్ ప్యాకెట్లు 10, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పాపిరెడ్డి కాలనీ వాంబే క్వార్టర్స్ వద్ద ఖాళీ స్థలంలో చెత్తాచెదారం

శేరిలింగంపల్లి: పరిసరాల పరిశుభ్రత అక్కడ మచ్చుకైనా కానరాదు. రోజుల తరబడి అక్కడ చెత్త పేరుకుపోయినా జీహెచ్ఎంసీ పట్టించుకోలేదు. పాపిరెడ్డి కాలనీ వాంబే గృహ సముదాయం వద్ద చెత్త భారీగా పేరుకుపోయింది. ఇంటితో బాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జీహెచ్ఎంసీ అధికారులు ఇటీవల అవగాహన కార్యక్రమాలు చేపట్టినా అనుకున్న ఫలితాలు రావడంలేదు.ఇక చెత్త సేకరణ ఆటోలు వస్తున్నా కాలనీలు, బస్తీలు చెత్తమయంగా ఉన్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దాల మేడలు.. బహుళ అంతస్థులు

రూపురేఖలు మారిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం


ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ప్రధాన కూడలి విప్రో సర్కిల్

రాయదుర్గం: నగర శివారులోని నానక్‌రాంగూడ గతంలో రాతి, మట్టిగుట్టలు, పంటపొలాలతో దర్శనమిచ్చేవి. కానీ నేడు జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఆర్థిక సంస్థలు, స్టార్ హోటళ్ళు, ఇతర సంస్థల కార్యాలయాలు రావడంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. బహుళ అంతస్థుల భవనాలు, విశాలమైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నానక్‌రాంగూడలో సుమారు 313 ఎకరాల్లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం ఏర్పాటైంది. ఇందులో అంతర్జాతీయ, జాతీయస్థాయి కంపెనీలు ఏర్పడడంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత మరింత పెరిగింది. అమెరికన్ కాన్సులేట్ భవనం పూర్తవడంతో త్వరలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగనున్నాయి.

- అమెరికన్ కాన్సులేట్, అమెజాన్ రాకతో మరింత ప్రాధాన్యం
- అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు నెలవు

ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ఉన్న కంపెనీలు ఇవే..

- నానక్‌రాంగూడలోని 313 ఎకరాల విశాల స్థలంలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం ఏర్పాటైంది.
- అమెజాన్ క్యాంపస్‌తోపాటు అమెరికన్ కాన్సులేట్, మైక్రోసాఫ్ట్, ఐఐఆర్‌డీఏ, ఐసీఐసీఐ బ్యాంకు, ఐఐఆర్ఎం, హనీవెల్, కాంగ్నిజెంట్, హిటాచీ కన్సల్టింగ్, వర్చ్యుషా, యాక్సెంచర్, టీసీఎస్, సైయింట్, క్యాప్ జెమినీ, కంప్యూటర్ అసోసియేట్స్(సీఏ), ఓఎన్‌జీసీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, విజువల్ సాఫ్ట్, విప్రో, ఇన్ఫోసిస్ ,వేవ్‌రాక్, క్యూసిటీ, వన్‌ప్లస్ ఆర్ అండ్ డీ సెంటర్, గూగుల్ ఉన్నాయి.
- టీఎస్ఐఐసీ సైబరాబాద్ జోన్ కార్యాలయం , కాంటినెంటల్ ఆస్పత్రి, వరుణ్‌మోటార్స్, జలమండలి గచ్చిబౌలి సెక్షన్ కార్యాలయం, శాంతిసరోవర్‌లోని ఇన్నర్‌సేఫ్ భవనం, గోపీచంద్ అకాడమీ, షెరటాన్, ఓక్‌వుడ్ రెసిడెన్సీ, హయత్ వంటి స్టార్ హోటళ్ళు, కపిల్ టవర్స్,ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) వంటివి అందుబాటులోకి వచ్చాయి. ఐటీ ఉద్యోగుల కోసం టీఎస్ఐఐసీ ఉచిత బస్సులు, షీ బస్సులు ఉన్నాయి.



త్వరలో మెట్రో సౌకర్యం..

ఔటర్ రింగురోడ్డు నానక్‌రాంగూడ మీదుగా శంషాబాద్‌కు మెట్రో రైలు ఏర్పాటునకు గత ఏడాది అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. తదనంతరం ప్రభుత్వం మారడంతో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి గచ్చిబౌలి మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించాలని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో ఈ రూట్‌లో మెట్రో సౌకర్యం కలగనుంది.

లింకు రోడ్డు..

- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య రాకుండా ఉండేందుకు కొత్తగా లింకురోడ్లు, ఇతర రోడ్లను విస్తరించారు.
- ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రోడ్డు నుంచి హయత్ హోటల్ మీదుగా షెరటాన్ హోటల్ ముందు నుంచి విప్రో సర్కిల్, ట్రిపుల్ ఐటీ కూడలి మీదుగా నగరానికి శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాలను కలిపేలా లింకురోడ్డు నిర్మించడంతో చాలా వరకు రాకపోకలు పెరిగాయి.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం నుంచి గౌలిదొడ్డి మీదుగా గోపన్‌పల్లితండా వరకున్న రోడ్డును అత్యాధునిక స్థాయిలో ఆరులేన్లుగా మార్చడంతో ఈ ప్రాంతం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.


ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్‌కు వెళ్ళే ప్రధాన రోడ్డు



ఫైనానిన్షయల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో టీఎస్ఐఐసీ సంస్థ ఏర్పాటు చేసిన బోర్డు

కల్యాణోత్సవం



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని శ్రీ జమదగ్ని మహాముని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, వాలా హరీష్‌రావు, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, మనోహర్ గౌడ్, వేణు, తిరుమలేష్, కాలనీవాసులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



హఫీజ్‌పేట్: రంజాన్ మాసంను పురస్కరించుకుని మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధి మార్తాండనగర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, సీనియనర్ నాయకులు మహిపాల్ యాదవ్‌లు హాజరయ్యారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాంబశివరావు, బషీరుద్దిన్, గౌసుద్దీన్, నజీరుద్దీన్, ఫిరోజ్, షేక్ చాంద్ పాషా, సయ్యద్ నవాజ్ అలీ, రషీద్, ఫాయిమ్, జానీ, గోపాల్ నాయక్, ఇబ్రహీం, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మియాపూర్: మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి మహిళలు సాయి నామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయిబాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలి

శంషాబాద్: పట్టణంలోని బాలాజీ వెంచర్ సమీపంలోని సంగమేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలని బీజేపీ నేతలు మంగళవారం ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు 620/1లో ఉన్న ఆలయాన్ని రెండేళ్ల క్రితం స్థిరాస్తి వ్యాపారులు తొలగించినా ఇప్పటి వరకు దానిని దేవాదాయశాఖ పట్టించుకోలేదన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయ పునర్నిర్మాణం విషయంలో దేవాదాయశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని బీజేపీ నేతలు జితేందర్, మహేందర్, మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆలయాన్ని తొలగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు

టెక్నాలజీపై పట్టు పెంచుకోవాలి

రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్

హఫీజ్‌పేట్: మారుతున్న టెక్నాలజీపై పట్టు పెంచుకోవడం, దానికి మరింత ప్రాచుర్యం కల్పించడం ఎంతో అవసరమని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో గేమ్ చేంజర్ ప్లాట్‌ఫారమ్ 'ఈవెంట్ సీడ్'ను ఆయన లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఈవెంట్ ఇండస్ట్రీకి వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. మారుతున్న టెక్నాలజీ సవాళ్ళను అధిగమించగలమనే నమ్మకం ఏర్పడాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి సంస్థలు అభివృద్ధి చెందడంతోపాటు మరిన్ని నగరాలకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీహబ్ సీఓఓ అనీష్ ఆంథోని, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరీ స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరామ్‌బాబు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గోపాల్‌నగర్ కాలనీ, కేపీహెచ్‌బీ 2, 3 సర్వీస్ రోడ్డు, నేతాజీనగర్ పార్కు ఆక్రమణల తొలగింపు కోసం మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పాదచారుల హక్కులు, భద్రత దృష్ట్యా, ప్రయాణీకుల సౌలభ్యం కోసం ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు వ్యాపారులు, షాప్ కీపర్లు ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. కూకట్‌పల్లి జోన్ సర్కిల్స్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కోసం రెగ్యులర్ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని ఆమె తెలిపారు.

చిన్నారుల వర్ణ సోయగం..

సఫారీ కిడ్ ప్రీ స్కూల్లో హోలీ వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: ఇంద్రధనస్సులోని వర్ణాలతో చిన్నారుల వేడుకలకు వేదికైంది నగరంలోని సఫారి కిడ్ ప్రీ స్కూల్. హోలీ పండుగ నేపథ్యంలో నానక్‌రాంగూడలోని సఫారీ కిడ్‌స్కూల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్ గున్న సాహితీరెడ్డి మాట్లాడుతూ.. స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనే కాకుండా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చిన్నప్పటి నుంచే చిన్నారులకు అలవాటు చేయడం తమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. హోలీ వేడుకల్లో భాగంగా ఫ్లవర్ హోలీ, బెలూన్ ప్లే, హోలీ కార్డ్ మేకింగ్, వాటర్ ప్లే నిర్వహించామని, వీటికి అనుగుణంగా ఏర్పాటు చేసిన సంగీతానికి చిన్నారుల డ్యాన్సులతో అలరించారని తెలిపారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే

బంజారాహిల్స్: చెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ దృష్టిసారించింది. ఈ మేరకు చెరువులు కబ్జాకు గురికాకుండా చుట్టూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా నిత్యం పర్యవేక్షించేందుకు లేక్ కమిటీలు ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్, కార్వాన్ సర్కిళ్ల పరిధిలో 14 చెరువులు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటికీ లేక్ కమిటీలు ఏర్పాటుచేశామన్నారు. కమిటీల్లో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖ అధికారులతో పాటు స్థానిక సంక్షేమ సంఘాలను కూడా భాగస్వాములు చేశామన్నారు. ఒక్కో కమిటీలో 8 మంది సభ్యులు ఉంటారని, వీరంతా ప్రతిరోజూ తమకు కేటాయించిన చెరువులను పరిశీలించాల్సి ఉంటున్నారు. అంతేకాకుండా చెరువుల ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఉప కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసులు ప్రతిరోజూ ఈ ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాల్సిన బాధ్యత ఉంటుందని చెప్పారు. తరచూ కమిటీ సమావేశం జరుగుతుందని, ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాలని స్పష్టం చేవారు. ఎక్కడైనా చెరువు కబ్జా జరిగితే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే తెలిపారు.

జేఎన్‌టీయూలో నేడు, రేపు ఉచిత హెల్త్ క్యాంప్

బాలానగర్: జేఎన్‌టీయూలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఈ నెల 27, 28 తేదీల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎస్. శోభారాణి తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో బీపీ ఆర్‌బీయస్, కార్డియాలజీ, ఈసీజీ ఏకో, కాస్మొటాలజీ, డెంటల్, మహిళలకు క్యాన్సర్ , మోమోగ్రఫీ వంటి టెస్ట్‌లు నిర్వహించనున్నారు. ఈ హెల్త్ క్యాంపులో యూనివర్సిటీ, కాలేజి విద్యార్థులు, ఉద్యోగులు పరీక్షలు చేయించుకోవచ్చని యూనివర్సిటి పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. ప్రసన్న తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో అపోలో ఆసుపత్రి, వాసన్ ఐకేర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. పద్మావతి తెలిపారు.

కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాహనాలపై పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించడమే కాకుండా డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం పంజగుట్ట ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులను గుర్తించారు. బ్లాక్‌ఫిల్మ్‌తో తిరుగుతున్న కారును ఆపి ఫిల్మ్‌లు తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్ హెచ్చరించారు.

రోడ్లపై వ్యర్థాలు


ఫిలింనగర్ దీన్‌దయాల్‌నగర్ చౌరస్తాలో వ్యర్థాలు

ఫిలింనగర్: కాముని దహన వేడుకలు ముగిసి మూడు రోజులు గడుస్తున్నా బస్తీల్లోని రోడ్లు, కూడళ్ల వద్ద బూడిద వ్యర్థాలు ఇంకా తొలగించలేదు. రోడ్డు మధ్యలో ఈ వ్యర్థాలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిలింనగర్ బస్తీల్లో చాలా కూడళ్లలో ఈ వ్యర్థాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి.

పార్కింగ్‌తో జనం బేజార్

- ఇరుకుగా మారుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు


రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాల పార్కింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

రాయదుర్గం: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడలో నివసించే అస్సామ్ రాష్ట్రానికి చెందిన బికరమ్(34) హౌజ్ కీపర్. భార్య మణి బికరమ్‌తో కలిసి ఉంటున్నారు. వీరిద్దరు రెండేళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. నానక్‌రాంగూడ వచ్చి ఉంటున్నారు. ఇటీవల ఉదయం 11 గంటల ప్రాంతంలో బికరమ్ బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. పరిసరాల్లో, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం భార్య మణి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. బాలిక

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలో.. బాలిక(17) 6 వ తరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకుంది.తిరిగి ఉదయం 5 గంటలకు కుటుంబ సభ్యులు లేచి చూడగా బాలిక కనిపించలేదు.దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు.బాలిక అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మణికొండ: పార్కులు, కమ్యూనిటీ హాల్, కమర్షియల్, ఖాళీ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ, 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్‌ను కోరారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 22/పి, 23,24,25,26లలో వచ్చిన వేంకటేశ్వర కాలనీ లేఅవుట్‌లోని ప్రజల అవసరాలకు కోసం వదలిన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని సకాలంలో స్పందించి అడ్డుకోవాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు వినతిపత్రం హెచ్ఎండీఏ కార్యాలయంలో అందజేశారు. ఇటీవలే కాలనీ ప్రజలు ఆందోళన నిర్వహించారని, ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని లేదంటే భవిష్యత్తులో మున్సిపల్, హెచ్ఎండీఏ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.